పుట్టవచ్చు, డెత్‌కు డెత్ ఉంటే మనందరం చనిపోవచ్చు. వాస్తవంలో రెండూ లేవు. పుట్టుక అనేది ఒకటి ఉంటే నువ్వు పుడతావు అసలు పుట్టుకే లేనప్పుడు మనిషి ఎలా పుడతాడు? అలాగే అసలు చావే లేనప్పుడు మనిషి ఎలా చనిపోతాడు? ఇంక మనుషులు ఎక్కడ ఉన్నారు అంటే దాని అర్థం ఉన్నది బ్రహ్మం ఒక్కటే. దానికి పుట్టుకలేదు, చావులేదు. అద్వైతం అంటే అదే.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-08-2014, అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన దుఃఖానికి కారణం ఏమిటి అంటే మన అహంకారమే దుఃఖానికి కారణం. మీకు ధనం ఉండవచ్చు, అధికారం ఉండవచ్చు, కీర్తి ఉండవచ్చు ఎన్ని ఉన్నా మనలో అహంకారం ఉన్నంతసేపు ప్రతీ మనిషినీ కూడా దుఃఖం వెంటాడుతుంది. ఒక మనిషికి దుఃఖం రావటానికి వాడి కుటుంబపరిస్థితులు, సమాజపరిస్థితులకంటే అహంకారమే మెయిన్ కారణం. భగవాన్, బుద్ధుడు కూడా చాలా తక్కువగా మాట్లాడేవారు. మీరు అవసరంలేని మాటలు మాట్లాడుతూ ఉంటే మీరు చెప్పేది బుద్ధుడు వినేవాడు. మీరు చెప్పిన మాటలు నాకేమైనా ఉపయోగపడతాయా అని అడిగేవాడు. ఆ మాటలు మీకు ఉపయోగ పడవు అని చెప్పేవారు. నాకేమీ ఉపయోగపడనప్పుడు అవి నాతో ఎందుకు మాట్లాడుతున్నారు అనేవాడు. అంటే ప్రతీ మనిషి కూడా అహంకారం వలన ఎక్కువగా మాట్లాడుతున్నాడు కాని అవసరాన్ని బట్టి మాట్లాడటంలేదు. అవసరం ఉంటే మాట్లాడవచ్చు. అహంకారంకోసం మాట్లాడుతూ ఉంటే దానివలన వ్యక్తిభావన పెరిగిపోతుంది.

మనం శాంతిగా ఉండాలి. ఈ శరీరాన్ని విడిచిపెట్టి జీవుడు బయటకు వెళ్ళేటప్పటికి మన జీవలక్షణాలు అన్నీ పోయి పరమాత్మలో ఐక్యమయ్యే స్థితికి చేరుకోవాలి అని మనం కోరుకుంటున్నాము. అలా కోరుకోవటంలో పొరపాటులేదు. మనకు దుఃఖం ఉండకూడదు అనుకొంటాము కారణం మన స్వభావంలో అది లేదు కాబట్టి అలా అనుకొంటున్నాము. అయితే దురదృష్టం ఏమిటి అంటే మనకు వచ్చే తలంపులు దుఃఖాన్ని తీసుకొనివచ్చే తలంపులు వస్తున్నాయి. నోటితో దుఃఖాన్ని తీసుకొని వచ్చే మాటలు మాట్లాడుతున్నాము, చేతితో దుఃఖాన్ని తీసుకునివచ్చే పనులు చేస్తున్నాము, కోరుకోవటం మటుకు సుఖాన్ని కోరుకుంటున్నాము. తూర్పువైపుకు వెళ్ళాలి అనుకుంటున్నాము. పడమరవైపుకు నడుస్తున్నాము. మన పరిస్థితి

ఇలా ఉంది. మనం ఏదైతే ఆశిస్తున్నామో దానికి అనుగుణమైన కర్మ ఉండాలి. మనకు హేపీనెస్ కావాలి. అందుచేత భగవంతుడు మనకు ఇచ్చిన నోటితో మనకు హేపీనెస్ తీసుకొని వచ్చే మాటలు మాట్లాడాలి, చేతితో మనకు హేపీనెస్ తీసుకొనివచ్చే పనులు చెయ్యాలి, మనకు వచ్చే తలంపులు అన్నీ కూడా మనకు ఆనందాన్ని తీసుకొనిరావాలి. హేపీనెస్‌కు దూరం చేసే మాటలను, హేపీనెస్‌కు దూరం చేసే తలంపులను మనం కంట్రోలు చేసుకోవాలి.

కృష్ణుడు ఏమనిచెప్పాడు అంటే నీ దేహయాత్రకు సరిపడ పని చేసుకుంటూ, నీ దేహయాత్రకు సరిపడ ధనం విషయంలో ఇతరులమీద ఆధారపడకు. ఇతరులమీద ఆధారపడితే నీకు బానిసత్వం వస్తుంది అని చెప్పాడు. రైట్‌పాత్‌లో సంపాదించటం అనేది కొంతమందికి ఒక ఆర్ట్. అది అందరికీ ఉండదు. అయితే నీ అవసరాలకు మించి సంపాదించే శక్తి నీకు ఉంటే ఆ శక్తిని నువ్వు పాడుచేసుకోనక్కరలేదు. నీ అవసరాలకు జాగ్రత్తపెట్టుకొని మిగిలిన ధనాన్ని సమాజానికి ఉపయోగించవచ్చు. అందులో ఏమీ పొరపాటు లేదు, అది కూడా యజ్ఞమే అని బుద్ధుడు చెప్పాడు. ప్రపంచంలో ఏది జరిగినా, ఏది జరగక పోయినా దేహం వచ్చింది అంటే అది మరణించటం తథ్యం. మనం అనుకొన్నవి జరగవచ్చు, జరగకపోవచ్చు కాని మరణం రావటం అనేది నూటికినూరుపాళ్ళు జరుగుతుంది. దేహం వచ్చింది అంటే అది ఏదోరోజు మరణించటం తథ్యం. ధర్మరాజు ఇంటి దగ్గర ఏదో ఫంక్షన్ జరిగింది. ఫంక్షన్ అయిపోయిన తరువాత అందరూ వెళ్ళిపోతున్నారు. ధర్మరాజు అతిథులను సాగనంపుటలో బిజీగా ఉన్నాడు. ఏమండీ మీకు తోచింది ఏదైనా ఇవ్వండి అని ఎవడో యాచకుడు వచ్చాడు. రేపు రావయ్యా అన్నాడు ధర్మరాజు. వాడు వెళ్ళిపోతున్నాడు. ప్రక్కనే భీముడు ఉన్నాడు. ధర్మజా! వీడిని రేపు రమ్మంటున్నావు రేపటిదాకా నువ్వు, వాడు ఉండాలి కదా! ఇవ్వటానికి రేపు రమ్మంటావు ఏమిటి? నీకు తోచింది ఇచ్చి పంపించేయి అన్నాడు భీముడు. అందుచేత నువ్వు ఏదైనా మంచి పని చేయాలనుకొన్నప్పుడు వాయిదా వేయవద్దు, మీకు ఏదైనా చెడుతలంపు వస్తే దానిని వాయిదా వేస్తూ వెళ్ళండి అంటే పోస్ట్‌పోన్ చేసుకుంటూ వెళ్ళండి, అప్పుడు అది నెమ్మదిగా సన్నగిల్లిపోయి చనిపోతుంది. మంచిపని చేయాలనుకున్నప్పుడు మీరు వెంటనే చేసేయండి, పోస్ట్‌పోన్ చెయ్యకండి. అదే మీకు ఏదైనా చెడ్డ ఆలోచన వచ్చినప్పుడు దానిని వెంటనే యాక్షన్‌లో పెట్టకుండా పోస్ట్‌పోన్ చేస్తే కొంతకాలానికి దానికి నేచురల్‌గానే డెత్ వచ్చేస్తుంది.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# స్వీయ సంస్కరణ

మనము శాంతిని ఆనందాన్ని కోరుకుంటాం, కాని మనము ఏరకంగా జీవిస్తే శాంతి, ఆనందం లభిస్తాయో ఆ ప్రయత్నం చెయ్యము. పరమాత్మకు మరోపేరే శాంతి. మనము కోరుకునే శాంతి, ఆనందం మన స్వరూపంగా హృదయంలోనే ఉంది. కాబట్టి పరమాత్మకన్న వేరుగా ఉన్నాను, అనే వేరుభావన నుండి అనగా వ్యక్తిభావన నుండి విడుదల పొందాలి. కేవలం ఉనికి గల బ్రహ్మమే మన దృష్టికి లోకంగాను, ఇతరులు గాను కనిపిస్తోంది. మనకు స్వరూపశాంతి అనుభవైకవేద్యం కావాలంటే ఇతరులలోని దోషాలను కాకుండా, వారిలోని అంతర్యామినే దర్శించాలి. నీటిబుడగను మహాసముద్రంగా దర్శించే విశాల దృష్టిని అలవరచుకోవాలి. ప్రపంచాన్ని పరమాత్మగా దర్శించాలి. మనలోని దోషాలను, చెడు ఆలోచనా సరళిని సరిదిద్దుకొని మనను మనమే సంస్కరించుకోవాలి. ఇతరులను మార్చే ప్రయత్నము, పరిస్థితులను మార్చే ప్రయత్నము చెయ్యకుండా, మనను మనము మార్చుకునే ప్రయత్నం చెయ్యాలి, అదే గొప్ప సంస్కరణ. ప్రపంచం అనే సమిష్టి కుటుంబంలో మనమంతా సభ్యులమే! చిన్న పనినైనా అత్యంత శ్రద్ధగా చేస్తూ, ఓర్పు, సహనంతో ముందుకు సాగాలి. మనస్సే సంసారం. మన మనస్సు బాధపడకుండా ఉండాలంటే, ఇతరుల మనస్సును బాధపెట్టకూడదు. ఇతరుల గురించిన చెడుతలంపులను మనస్సులో మొయ్యకూడదు, అనుకరణ పనికిరాదు. మనను మనం బాగుచేసుకోవడానికి సత్కర్మ నిష్కామంగా చెయ్యాలి. సహనము, సౌశీల్యము, సామరస్యం, మైత్రి, సేవాగుణము, మున్నగునవి అలవరచుకోవాలి. త్రికరణాల ద్వారా అహంకారం వ్యక్తం కాకుండా, వాటిని పరమాత్మకేంద్రంగా ఉపయోగించుకోవాలి. దేహం జీవించియుండగానే మనం పొందవలసిన నిరహంకారస్థితిని పొందితీరాలి. అహంకారానికి సంతృప్తి కలిగించే పనులుకాక, పరమాత్మకు ప్రీతి కలిగించే పనులు చెయ్యాలి. అజ్ఞానం దూరంగా ఎక్కడో లేదు, దేహము-నేను అను తలంపు రూపంలో ఉంది. సాధన లేకుండా ఏది సాధ్యంకాదు కాబట్టి, ఎలా జీవిస్తే పరమాత్మను స్వరూపంగా అనుభవైకవేద్యం చేసుకోగలమో, అలా జీవించడమే ధర్మం.

ఓంతత్సత్

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

## మోహానికి మూలకారణం అజ్ఞానం - దాని నాశనానికి గురువును శరణుపొందాలి - 2

దుఃఖానికి మూలకారణం అయోమయం. బ్రహ్మానందానికి పునాది స్పష్టత. అది తెలిస్తే ఆనందంగా ఉంటాము. జాగరూకతే జీవితమని తెలుస్తుంది. మనం ఆకారాల్లో మమకారం పెట్టుకొన్నాము. మన కళ్ళు రూపం దగ్గర ఆగిపోయి ఉన్నాయి. గురువుకు శరణు పొందితే సాయం సాధ్యమౌతుంది. మనం మానసిక మరణానికి సిద్ధంగా ఉండాలి. గురువు వద్దకు మనం తీర్పులతో వెళితే అసలు ఏమాత్రం వెళ్లనట్లే. సద్గురువులు కొద్దిమందే ఉంటారు. అటువంటి వారితో ప్రభావితం కావటం కష్టం. ఎందుకంటే మన సొంతమైన అహంకారం చనిపోవటం అన్నమాట. గురువు మనపై పనిచెయ్యటానికి ఒప్పుకోవటం మిక్కిలి సాహసవంతమైనదిగా ఉంటుంది. ఆయన మన హృదయాన్ని తెరిస్తే కోట్లాది వాసనలు ఉంటాయి. మనలను ఆయన ఎక్కడికి తీసుకొనివెళ్తుతారో తెలియదు. మనం విశ్వసించాలి. తర్కం ప్రయోజన కారి కాదు. ప్రేమ మాత్రమే సాయం చేస్తుంది. మనలో ప్రేమ మరుగునపడి ఉంటుంది. విద్యను గురు అనుగ్రహంతో, గురుముఖతః నేర్చుకోవలసిందే కాని మరో మార్గం లేదు. కంటికి కనబడనిది సత్యం అది నిర్వికారము, అవి నాసి, కంటికి కనబడే రూపాలు అన్నీ మార్పుచెందేవి, నశించేవి. కాని మనం దాన్నే శాశ్వతమని తలుస్తాము. మనం పిరికి వాళ్లమై దేవతల వద్ద మొరపెట్టుకొంటే గట్టు ఎక్కలేము. కుక్కచావు తప్పదు. మూఢవిశ్వాసాలకు మోకరిల్లి మన మనస్సును అమ్ముకోకూడదు. మనం అనంతులం, అమరులము, అభయులమని నిశ్చయించుకోవాలి. సంభవిస్తున్నవన్నీ నశించేవనే ఎరుక కావాలి. మనం మూర్ఖులుగా, నిర్లక్ష్యంగా ఉంటే గురువు సాయం అందదు. వినయం, విధేయత, సత్యాన్ని తెలుసుకోవాలనే కాంక్ష సాధన కావాలి. అప్పడే ఆయన మార్గదర్శి అవుతారు. అది మనకు అమూల్య నిధి. ఆయన మనలను నిరంతరం ప్రోత్సహిస్తూ, భుజం తడుతూ ఉంటారు. మనకు ఈ సమాజం ఇచ్చే అబద్ధపు వ్యక్తిత్వాన్ని కొంచెం కొంచెం తీసేస్తూ ఉన్నా ఆటంకపరచము. మనకు ఏ హానీ చెయ్యరని, ఏ సాహసానికైనా సిద్ధంగా ఉంటాము. అదే గురువు యొక్క కళ. అప్పడే మనకు నవోదయం అవుతుంది. గురువుతో మనం గడపటం వల్ల పొందే అందం, పరమానందం అని మనకు తెలుస్తుంది. అది మనం ఆవిష్కరించుకొన్న మహాభాగ్యమే. గురువుయొక్క సన్నిధి ఎంత అమోఘమో గోపికలకున్న అనుభవములో కించెత్తు ఉన్నా అది జ్ఞానోదయం, మోక్షం, అనే మాటలు పొడిపొడిగా తోస్తాయి. అంతకన్న అధికం లేదు అని మనం అనుకొన్నా గురువుకు అన్నీ తెలుసు. ఇంతకన్న అధికమైనది ఉందని ఇందుల్లో ఇరుక్కు పోనియ్యడు, అదీ బంధమే కాని చివరిది. అనంతంలోకి గల ద్వారాలను తెరవటానికి అదే. అప్పడు గురువు సందేశం “నా దారిలోంచి తొలగు” అనే సంకేతాలు ఇస్తాడు. తోతాపురి రామకృష్ణుని ఇచ్చినట్లు. అప్పడు మనం నష్టపోయేది ఏమీ లేదు. సహజానందంతో స్థిరత్వం పొందుతాము. మన అహంకారాన్ని నాశనం చెయ్యటమే గురువు లక్ష్యం, కర్తవ్యం. ఆ రుణం మనం తీర్చలేనిది అని జీవితాంతం గుర్తుంచుకోవాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**